క్లుప్తంగా

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలి

సైదాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయని, మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, సోమారం ఆదర్శ పాఠశాల మైదానాల్లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త గాదపాక కుమార్‌రాజా ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. క్రీడా ప్రాంగణాలు ప్రజలకు ఆరోగ్య రీత్యా ఉపయోగపడతాయని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ కొన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు క్రీడా ప్రాంగణాలను చెరువు, కుంటలు, గుట్టల ప్రాంతంలో ఏర్పాటు చేసి బిల్లులు కాజేశారు. ఇప్పుడవి నిరుపయోగంగా మారాయి. కొందరు పాఠశాల మైదానాలకే బోర్డులు బిగించారు. ప్రస్తుతం యోగా, వాకింగ్, వ్యాయామాలు అత్యవసరంగా మారాయి. ప్రజల సౌకర్యం కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కృషి చేయాలని కోరారు.

'హరితహారం మొక్కలు తొలగింపు'

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామంలో హరితహారంలో నాటిన మొక్కలను తొలగించారని, సర్పంచ్, ఉప సర్పంచ్ ఆరోపించారు. ఇటీవల గ్రామంలోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువ వద్ద రోడ్డుకు ఇరువైపులా సర్పంచ్ వనపర్తి మల్లయ్య, ఉపసర్పంచ్ చింతం కుమారస్వామి మొక్కలు నాటారు. కాగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా 100 మొక్కలు తొలగించారని సర్పంచ్, ఉపసర్పంచ్ ఆరోపించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌ను వివరణ కోరగా.. మొక్కలు తొలగించినట్లు సమాచారం అందిందని, బాధ్యులకు నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు.

గృహలక్ష్మి పథకం నిరంతరం కొనసాగించాలి

సైదాపూర్: గృహలక్ష్మి పథకం దరఖాస్తులు నిరంతరం స్వీకరించాలని డీసీసీ అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. పదేండ్లుగా ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల కోసం నిరుపేదలు ఎదురు చూశారని, ఇప్పుడు వారం రోజుల గడువుతో ముగించడంతో అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోలేక పోతున్నారని, సొంత స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి రూ. మూడు లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం నిరంతరంగా దరఖాస్తులు తీసుకోవాలని కోరారు.

19న బహుజన ఆత్మగౌరవ సదస్సు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల19న బహుజన ఆత్మగౌరవ సదస్సు నిర్వహించనున్నామని అంబేద్కర్ యువజన సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ తెలిపారు. కేశవపట్నంలో శనివారం బహుజన ఆత్మగౌరవ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజలకు హక్కులను కల్పించారని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల హక్కులను అణిచివేస్తోందని ఆరోపించారు. సదస్సుకు గజ్జెల కాంతం హాజరవుతారని, సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి దేవునూరి కిష్టయ్య, మేరుగు శ్రీనివాస్, బొజ్జ రవి, ఓదెలు, రాజయ్య తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్స్



టీషర్ట్స్ అందిస్తున్న సభ్యులు

రామడుగు: మండల కేంద్రంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్న రామడుగు టైటాన్స్ ఎలెవన్ క్రికెట్ జట్టుకు శనివారం జైపాలన్న మిత్రమండలి సభ్యులు టీ షర్ట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు మాదం చందు, జిట్టవేని రాజు, రాగం కనకరాజు, అనుపురం శ్రీనివాస్‌గౌడ్, మాదం సూర్యప్రకాష్, పూరెల్ల మనోజ్, దిలీప్, ముజాకీర్, సంపత్, రాకేశ్, ప్రవీణ్, శేఖర్ పాల్గొన్నారు.

బస్‌పాస్‌లు పంపిణీ



బస్‌పాస్‌లు పంపిణీ చేస్తున్న డీఎం అర్పిత

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం బస్టాండ్‌లో హుజూరాబాద్ డిపో మేనేజర్ అర్పిత శనివారం దివ్యాంగులకు బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో 120 మందికి పాస్‌లు అందించారు. కేశవపట్నం బస్టాండ్‌లో భద్రాచాలం, కొత్తగూడెం, కామారెడ్డి బస్సులు ఆపాలని ప్రయాణికులు డీఎంను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు తనుకు ప్రభాకర్, శంకర్ లింగం, బాబన్న, ఆర్టీసీ ఉద్యోగులు గుర్రం స్వామి, దేవేందర్‌రెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.



దెబ్బతిన్న ధర్మరాజుపల్లి నుంచి ఉప్పల్ వెళ్లే రోడ్డు



రాంపూర్ నుంచి జూపాక వెళ్లే రోడ్డు మార్గంలో కల్వర్టు



రామడుగు: మోతె శివారులో తెగిపోయిన రహదారి

రాకపోకలు బంద్

- ఇటీవల భారీ వర్షాలకు తెగిన రోడ్లు
- మరమ్మతులు మర్చిన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మండలంలోని ధర్మరాజుపల్లి నుంచి ఉప్పల్ వెళ్లే రోడ్డు వరదకు పూర్తిగా కొట్టుకొని పోయి తారురోడ్డు రెండుగా విడిపోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని రాంపూర్ నుంచి జూపాక వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. వర్షాలు తగ్గినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలన్న ఇబ్బందిగా మారిందని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా స్పందించి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

రామడుగు: భారీ వర్షాలకు మోతె శివారులో రహదారి తెగి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కనున్న వ్యవసాయ పొలాల్లో ఇసుక మేటలు, బావులు కూలిపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. కొత్తపల్లి నుంచి రామడుగు వయా మోతె, కొత్తపల్లి నుంచి రుద్రారం, రంగసాయిపల్లి, దత్తోజీపల్లి గ్రామాలకు వెళ్లాల్సిన రహదారి మోతె శివారులో ఇటీవల కురిసిన భారీ వర్షానికి మోతె వాగు పొంగి పొర్లడంతో బ్రిడ్జి పక్కకు గండి పడి 300 మీటర్ల మేర పొడవునా, దాదాపు నాలుగు నుంచి ఐదు మీటర్ల లోతు రోడ్డుకు గండి పడి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో నాలుగు, ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని మోతె గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోతె వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి పైపుల్లో గతేడాది వృక్షాలు, చెత్త చిక్కుకొని ఉండగా తొలగించకపోవడంతో వర్షపునీరు బ్రిడ్జి పైపుల గుండా వెళ్లకుండా పక్కకు గండి పడి రోడ్డు తెగిపోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాల ప్రయాణం పూర్తిగా నిలిచిపోయింది. వాగులో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రహదారి కొట్టుకుపోవడంతో మోతె, రుద్రారం, రంగసాయిపల్లి, దత్తోజీపల్లి గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు గండి పడటంతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి. వినోద్‌కుమార్, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, టీపీసీసీ అధికార ప్రతినిధి, చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మేడిపల్లి సత్యం పరిశీలించి వెళ్లారు. తెగిన రహదారికి ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులు చేసి బస్సులు గ్రామాలకు వచ్చేలా చర్యలు చేపట్టాలని మోతె, రుద్రారం, రంగసాయిపల్లి, దత్తోజీపల్లి, గాండ్లపల్లి ప్రజలు కోరుతున్నారు.

నియామకం



తిమ్మాపూర్: సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం తిమ్మాపూర్ మండల మహిళా అధ్యక్షురాలిగా పడాల సౌజన్యగౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షురాలు వడ్లకొండ అరుణగౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ పట్టణంలోని సర్వాయి పాపన్న మోకు దెబ్బ కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జక్కె వీరస్వామిగౌడ్, జిల్లా అధ్యక్షురాలు అరుణగౌడ్‌కు సౌజన్య కృతజ్ఞతలు తెలిపారు. గీత కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో కిషన్ గౌడ్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సురేశ్

మానకొండూర్: మానకొండూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కోండ్ర సురేశ్‌ను నియమిస్తూ యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ శనివారం నియామకపత్రం అందజేశారు. నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామంలో మేరీ మాటి–మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. పార్టీ పిలుపు మేరకు గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ ముగింపు కార్యక్రమం ఎంపీటీసీ రంగు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు మరువలేనివని, ఈ నెల 30 వరకూ జరిగే నా దేశం – నామట్టి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్, అంబటి తిరుపతి, మియాపురం లక్ష్మణాచారి, మొగిలి. కోల శ్రీనివాస్, అశ్విన్ తేజ, బలరాం, రంగు శ్రీనివాస్, బండ రాజిరెడ్డి, రావుల వెంకటరాజం, తిక్క దేవేందర్, రాజు, సదయ్య, పర్శరాములు సంపత్, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

జమ్మికుంట: ప్రతి ఒక్కరూ దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు అన్నారు. శనివారం జమ్మికుంటలో పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ ఆధ్వర్యంలో మేరీ మాటి– మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా శ్రీ లక్ష్మి గణపతి షిరిడి సాయిబాబా దేవాలయంలో బీజేపీ కార్యకర్తలు మట్టి పట్టుకొని ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... 2047 నాటికి విశ్వగురుగా దేశాన్ని తయారు చేయడంలో బీజేపీ కార్యకర్తల పాత్ర క్రియాశీలకంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులును శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి ఠాగూర్ రాజేశ్, పల్లపు రవి, మోతె స్వామి, ఇటికాల స్వరూప, కైలాసకోటి గణేశ్, రాజేశ్‌ఠాగూర్, మోడం రాజు, కొండే నగేశ్, రామ్ పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో బీసీలకు అన్యాయం



కొండాపూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

చిగురుమామిడి: సమాజంలోని బీసీలకు విద్యా, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో తీరని అన్యాయం జరుగుతోందని బీసీ సంక్షేమ సంఘం హుస్నాబాద్ నియోజకవర్గం కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కొండాపూర్, నవాబుపేట్ గ్రామాల్లో పల్లె పల్లెకు బీసీ చైతన్య కార్యక్రమం నిర్వహించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయం గడపగడపకూ వెళ్లి వివరించారు. 119 అసెంబ్లీ స్థానాలుంటే కేవలం 22మంది మాత్రమే బీసీలున్నారని, 549 మంది ఎంపీలుంటే 88 మంది మాత్రమే బీసీలున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రాజకీయాల్లో సరైన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై బీసీలను ఐక్యం చేసి ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెండు గ్రామాల బీసీ నాయకులు, గీతకార్మిక సంఘం అధ్యక్షుడు బుర్ర తిరుపతిగౌడ్, నాయకులు పూదరి రవీందర్‌గౌడ్, గజ్జల శ్రీనివాస్, టి శ్రీనివాస్ యాదవ్ పలువురు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నాయకుల ఆరోపణలు అర్థరహితం'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

గంగాధర: వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేయించడంపై ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని బీఆర్ఎస్ సోషల్ మీడియా నియోజకవర్గం అధ్యక్షుడు మ్యాక వినోద్, నాయకులు విమర్శించారు. శనివారం గంగాధరలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఓ వైపు తెగిన రోడ్లు, కల్వర్టుల మరమ్మతులు జరుగుతున్నా కళ్లుండి చూడలేని స్థితిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని, పంటనష్టంపై అధికారులు సర్వే చేస్తున్నారని, అవసరమున్న చోట బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. సమావేశంలో నాయకులు బండారి శ్రీనివాస్, తాళ్ల సురేశ్, జక్కుల వెంకటేశ్, గంగాధర శ్రీకాంత్, మధు, గుంటుకు ఆంజనేయులు, మ్యాక కరుణాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



చిగురుమామిడి: పరామర్శిస్తున్న అంజయ్య



గన్నేరువరం: నిత్యావసరాలు అందిస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని రామంచ గ్రామానికి చెందిన దొబ్బల రమేశ్ మూడు రోజుల క్రితం మృతి చెందాడు. బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య శనివారం రమేశ్‌కుటుంబ సభ్యులను పరామర్శించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ ఆదేశాల మేరకు రూ.10వేలు అందించారు. కుటుంబాన్ని అన్ని విధాలా పార్టీ ఆదుకుంటుందన్నారు. ఈకార్యక్రమంలో గిట్ల తిరుపతిరెడ్డి, సర్పంచ్ గుంటి మాధవితిరుపతి, ఉపసర్పంచ్ ఒంటెల కిషన్‌రెడ్డి, నాయకులు బెజ్జంకి రాంబాబు, సిద్దెంకి రాయమల్లు, నాగెల్లి రాజిరెడ్డి, రాచకొండ సంపత్, దొబ్బల కిరణ్, కర్ణకంటి లక్ష్మణ్ పలువురు ఉన్నారు.

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మడికంటి మధురమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. శ్రీమల్లికార్జునస్వామి ఆలయ చైర్మన్ వరాల పర్శరాములు రూ.ఐదువేలు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నూకల తిరుపతి ఇరవై ఐదు కిలోల బియ్యం, ఐదు లీటర్ల నూనె, మాజీ సర్పంచ్ జక్కనపల్లి సత్తయ్య ఇరవై ఐదు కిలోల బియ్యం, కానవేణి తిరుపతి వెయ్యి, ఉపాధ్యక్షులు రాజమల్లు రూ.ఐదు వందల ఆర్థికసాయం అందజేశారు.

వైద్య శిబిరాలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జమ్మికుంట: మండలంలోని గండ్రపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికల), పట్టణంలోని సాంఘిక గురుకుల సంక్షేమ (బాలుర) పాఠశాలల్లో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సన జవేరియా ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందుల పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ సన జవేరియా మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, కళ్ల కలక, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీ డాక్టర్ అపర్ణకార్తీక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ మంజుల, కుమారస్వామి, సూపర్‌వైజర్స్ స్వరూప, రత్నకుమారి, అరుణ, సదానందం, ఆరోగ్యశాఖ సిబ్బంది నరేందర్, సరస్వతి, రజిత, మణెమ్మ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

గన్నేరువరం: మండల కేంద్రంలో శనివారం సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటాలకు రేషన్ డీలర్లు క్షీరాభిషేకం చేశారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇతర డిమాండ్లు త్వరలో పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, చింతల సంపత్, బాబు, పద్మ, బాలయ్య, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరనిలోటు

చొప్పదండి: ప్రజా గాయకుడు గద్దర్ మృతి బహుజనులకు తీరని లోటని ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం గద్దర్ సంతాప సభ ఏర్పాటు చేశారు. పీడిత, ప్రజల పక్షాన పోరాటం చేసిన గొప్ప గాయకుడని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మల్లారెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, ఎంఈవో భూమయ్య, అంజయ్య, లక్ష్మినారాయణ, సాంబయ్య, సత్యనారాయణ, దొంత రాజయ్య, లచ్చయ్య, శ్రీనివాస్, రాజలింగం, రాజయ్య, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల అడ్డగింత



మానకొండూర్: మానకొండూర్‌లో గ్రామస్తులు ఇసుక లారీలను శనివారం రాత్రి అడ్డుకున్నారు. వీణవంక మండలం నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న లారీలను అడ్డుకొని ఆందోళన చేపట్టారు. ఇసుక లారీల రవాణాతో దుమ్ము ధూళి, వాహనాల శబ్దంతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రమాదాలు సైతం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై ఏఐఎస్ఎఫ్ అంకిత భావంతో పని చేస్తుందన్నారు. మాతృభూమి విముక్తి కోసం స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పాలకుల ఆగడాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. ఏఐఎస్ఎఫ్‌కు దేశ చరిత్రలో ఘనమైన స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు మాదరపు రత్నాకర్, ప్రనయ్, రాజు, పవన్, రవి పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వరదకాలువను పరిశీలిస్తున్న రవీందర్

రామడుగు: మత్స్యకారుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చేస్తుందని తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ ముదిరాజ్ అన్నారు. మండలంలోని వరదకాలువలో చేపల పెంపకం చేపట్టడం కోసం శనివారం కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే వరదకాలువలో మొదటిసారిగా చేపల పెంపకం చేపట్టనున్నామని, 102 కిలోమీటర్ నుంచి 122 కిలోమీటరు వరకు చేపలపెంపకం చేపట్టేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. దీనివల్ల స్థానికంగా ఉన్న కార్మికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాస్‌గుప్తా, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతిముదిరాజ్, పెద్దపల్లి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చైర్మన్ కొలిపాక నరసయ్య, తెలంగాణ ముదిరాజ్ మహాసభ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు పెసరు కుమారస్వామి, నెల్లి సమ్మయ్య, మాల కనకయ్య, ఆర్‌పీరాజు, రామాంజనేయుల, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

యుద్ధభేరిని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పద్మశాలీ నేతలు

హుజూరాబాద్‌రూరల్: కోరుట్లలో ఆదివారం జరగనున్న పద్మశాలి రాజకీయ యుద్ధభేరిని విజయవంతం చేయాలనీ రాష్ట్ర ప్రముఖులు, సామాజికవేత్త సబ్బని వెంకట్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని చేనేత సంఘం ఆవరణలో మాట్లాడారు. రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బీసీల్లో అధిక శాతం ఉన్న పద్మశాలీలు ఆర్థిక, సామాజిక పురోగతి సాధించడానికి విద్యా, వైద్యం, ఉద్యోగం ప్రతి కుటుంబానికి చేరడానికి రాజ్యాధికారం అవసరమని, పద్మశాలీల్లో చైతన్యం రగిలించడానికి, రాజకీయ అవగాహన కల్పించడానికి ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చలో కోరుట్ల పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి, ఆత్మగౌరవ సభ' కోరుట్లలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పద్మశాలీలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జీలు సంఘం సత్యనారాయణ, చిలుకమర్తి శ్రీనివాస్, జడల చిరంజీవి, ఇప్పాలపల్లి చంద్రశేఖర్, బండి కోటేశ్వర్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లకు అండగా ప్రభుత్వం



ముదిరాజ్‌లతో మాట్లాడుతున్న శ్రీనివాస్

గంగాధర: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదగడానికి అండగా నిలుస్తోందని కార్పొరేటర్, బీఆర్ఎస్ నాయకుడు కంసాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలోని పెద్దమ్మగుడి వద్ద ముదిరాజ్‌లతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రాజెక్టుల ద్వారా చెరువులు, కుంటలు నింపి ఉచితంగా చేపపిల్లలను అందిస్తూ వాటిపై ఆధారపడినవారికి అండగా నిలుస్తోందన్నారు. పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి రూ.పదివేల ఆర్థికసాయం అందించాడు. కార్యక్రమంలో ముదిరాజ్ ప్రతినిధులు గుండా మల్లేశం, వెంకటేశ్, బొమ్మరవేణి చంద్రయ్య, గుండ రాజమల్లు, రాజు, కొంరయ్య, అజయ్, సంతు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మహిళ

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లికి చెందిన యవుసాని కనకవ్వ అనే మహిళ శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కనకవ్వ కుమారుడు అనిల్ తెలిపిన వివరాలు...గ్రామంలో ఎకరం ఐదుగుంటల భూమి ఉంటే సోదరికి ఇరవై గుంటల భూమి కట్నంగా ఇచ్చామని, కానీ ఆమె మొత్తం భూమిని ఇతరులకు విక్రయించిందని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై అమ్మతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశామని, రెండు రోజులుగా సంబంధిత వ్యక్తులు భూమి దున్ని నాటు వేశారని తెలిపాడు. భూ వివాదంపై గ్రామంలోని కొందరు వ్యక్తులు బెదిరించడంతోనే మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిందని, చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించామని వివరించాడు.

'ముస్లిం మైనార్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిందేమీ లేదు'

జమ్మికుంట: ముస్లిం మైనార్టీలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేసింది ఏమీ లేదని హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సజ్జాద్ మహమ్మద్ ఆరోపించారు. శనివారం పట్టణంలోని జామ మజీద్ వద్ద మాట్లాడారు. 2015 నుంచి రిజర్వేషన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, రాజకీయంగాఎంత మందికి లబ్ధి చేకూర్చారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు మైనారిటీ కోటలో ఉన్న కోఆప్షన్ సభ్యుల నియామకం చేపట్టలేదన్నారు. నిరుపేద మైనారిటీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు దౌలత్, గఫ్ఫార్, పర్వేజ్, సలీం, దస్తగిరి, బాబా, నిసార్, నవాజ్, అక్బర్, రహీం, యాకుబఅలీ తదితరులు పాల్గొన్నారు.